# ఎక్కడున్నాం?

-శారదా అశోకవర్ధన్

కాఫీ కప్పు చేత్తో పట్టుకుని, మెల్లమెల్లగా సిప్ చేస్తూ చీకటి వెలుగుల రంగేళిలా, అప్పుడప్పుడే దూసుకొస్తున్న ప్రాతఃసంధ్య అందాలను ఆస్వాదిస్తూ నుంచున్నాను. అప్పుడే తెల్లారిపోయిందా అని ఆదుర్దాగా ఏవో అర్జంటు పనులు చూసుకోవాలన్నట్టు, గుంపులు గుంపులుగా పక్షులు వాయు మార్గాన పరుగులు తీస్తున్నాయ్. ఆ సుందర దృశ్యాన్ని మనోఫలకం మీద ముద్రించుకుంటున్న నేను ఒక్కసారిగా, పడమటి వైపునుంచి ఆ గోలేమిటో అర్థంకాక ఉలిక్కిపడి చూశాను.

మా ఇల్లు ఎత్తుగా కొండపైన ఉంటుంది. ఆ చుట్టుపక్కల ఖాళీ ప్రదేశం ఎక్కువగానే ఉంది. చిన్న చిన్న పొలాలు అక్కడక్కడా పట్నంలో పల్లెవాతావరణాన్ని గుర్తు చేస్తూంటాయి. జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఏమయిందో తెలీదు. మా వాచ్‌మెన్ గేటు తలుపులు మూసేసి గొళ్లెంపెట్టి బయటకి చూస్తున్నాడు.

ఎవరిమీదో కొందరు రాళ్లు రువ్వుతున్నారు. నందూ, ఊళ్ళో లేడు. ఉంటే నన్ను అలాంటివి చూడొద్దని లోపలికి తీసుకుపోయేవాడే. వాచ్‌మెన్ భార్య మంగ గబగబా లోపలికొచ్చి మెట్లెక్కి నా పక్కన నుంచుంది నాకు ధైర్యం చెప్పడానికన్నట్టు.

"ఏమైంది మంగా?" అడిగే లోపలే ఆ గుంపు మధ్య ఒక స్త్రీ... జుట్టు ముడి ఊడిపోయి వేలాడుతోంది చిందరవందరగా.

"పిచ్చిది...పిచ్చిది.." కొన్ని మాటలు.

"పిచ్చిదేం కాదు. కొవ్వెక్కి పొలాల్లో స్వేచ్ఛగా విటులని ఆకట్టుకుంటుంది. పట్టుబడితే పిచ్చిదానిలా వేషాలేస్తోంది" మరికొందరు.

"అంతే!...అంతే!...అయినా వంటిమీద ఒక్క గుడ్డ లేకుండా ఏమై ఉంటాయి?" ఒకరి సందేహం.

"ఇదే ఎక్కడో పడేసుంటుంది, ఏ మూల లోనో"

"అవునవును! కలికాలం...అడుక్కోడానికిదో మార్గం"

ఎవరికి తోచినట్టు వాళ్లు మాట్లాడుతున్నారు.

అందరూ కళ్ళు పెద్దవి చేసి ఆమెని నఖశిఖ పర్యంతం ఆబగా చూస్తున్నారు. ఆకలిగొన్న పులి మేకపిల్లని చూస్తున్నట్టు మగవాళ్లు...

"ఛీ...సిగ్గులేకపోతే సరి..ఎదవ బతుకు. సావాలి ఇట్టాటోళ్లు" కచ్చగా అంటున్నాయి కొన్ని స్త్రీ గొంతుకలు.

నేను ఆమెను చూడడానికి ప్రయత్నిస్తున్నాను. తోపుళ్లతో, రాళ్లతో, దెబ్బలతో ఆమెని అల్లరి పెడుతున్నది మగవారే... ఆడవాళ్ళు మాత్రం మాటల తూటాలు విసురుతున్నారు.

ఆమె వంటిమీంచి, నుదిటినుంచీ రక్తం చారలు కట్టింది. పెదవులు చిట్లి వాచినట్టున్నాయి. ఆ రాళ్ల దెబ్బలకి ఆమె చేతులడ్డు పెట్టుకోబోతోంది. అంతలోనే మరో రాయి విసిరారు చేతులమీద.

"అమ్మా" అంటూ బాధగా పరుగెడుతూంది.

మరికొంత మంది ఈ వింతను చూడ్డానికి పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆమె నగ్న శరీరాన్ని విస్ఫారిత నేత్రాలతో, కళ్ళు పెద్దవి చేసి మరీ చూస్తున్నారు.

ఆమె అరుపులు ఇంకా ఎక్కువయ్యాయి. నా గుండె అతి వేగంగా కొట్టుకోవడం నాకు తెలుస్తూనే వుంది. గబగబా వెళ్ళి, బీరువా తెరిచి, ఒక చీర తీసి మంగకిచ్చాను. ఎందుకన్నట్టు చూసింది మంగ.

"మంగా! మీ ఆయన్ని తోడు తీసుకుని వెళ్ళి, ముందు ఆ పిచ్చిదానికి చీర చుట్టి మనింటికి తీసుకురా!"

"మనింటికా?"

"అవును! వరండాలో కూర్చోబెట్టు. నేను ఇప్పుడే వస్తాను" అని దాన్ని కిందకి పంపాను. పిల్లలిద్దరూ ఇంకా లేవలేదు.

పరుగులాంటి నడకతో మంగా, రాములూ ఆమెని చేరుకున్నారు. కొన్ని రాళ్ళు వాళ్ళకీ తగిలాయి. ఆమె మంగని చూసి, దుఃఖంతో వాటేసుకుంది. క్షణంలో మంగ తన చేతిలోని చీర ఆమెకి కట్టింది. భుజంమీంచి కొంగు మెడనిండా కప్పింది. చెయ్యి పట్టుకుని, మంగని ఇంటికి తీసుకొచ్చింది. రాములు జనం లోపలికి రాకుండా గేటు మూసేసి, గొళ్లెం పెట్టాడు. అయినా జనం గేటుకావలనుంచి, సినిమా చూసినట్టుగా వింత చూస్తూనే ఉన్నారు.

నేను మంగని ఆమెకి కాస్త టీ పెట్టివ్వమని చెప్పాను. ఆమె అలిసిపోయినట్టు, వరండాలో ఒరిగిపోతోంది. మా కాలనీలోనే ఉన్న డాక్టర్ సురేష్‌రెడ్డికి ఫోన్ చేసి రమ్మన్నాను. అయిదు నిమిషాల్లో ఆయనొచ్చారు.


డాక్టరుగారు చెయ్యి పట్టుకుని వదిలేశారు స్టెతస్కోప్‌తో పనిలేక. మంగ చేతిలోని టీ గ్లాసుని పక్కగా పెట్టింది. డాక్టరుగారే రాములుకి ఏదో చెప్పారు.

రాములు వెళ్ళి అయిదు నిముషాల్లో కొందరిని వెంటబెట్టుకొచ్చాడు. వాళ్ళు ఆమెని రిక్షాలో ఎక్కించుకుని ఎక్కడికో తీసుకెళ్లారు.

"ఎక్కడికి పంపించారు డాక్టర్? ఆసుపత్రికా?"

"కాదమ్మా! ఆమె ప్రాణాలు పోయాయి. ఆమెని ఎవరో రేప్ చేశారు. బహుశా గ్యాంగ్ రేప్ అయ్యుంటుంది. వివస్త్రను చేసి వదిలేశారు. ఆ షాక్‌నుంచి ఆమె తేరుకునే లోపే, జనం ఆమెని పిచ్చిది అంటూ రాళ్లతో కొట్టిన దెబ్బలనూ తట్టుకోలేకపోయింది. ప్రాణం పోయింది. పాపం...ఎక్కడి మనిషో ఏమిటో?"

"ఆమె బిచ్చగత్తె అని చెప్తున్నారమ్మా!" మంగ అంది.






రిక్షాలో మహర్షి ఆసుపత్రికి తీసుకెళ్ళమని చెప్పాను. వాళ్లు పోలీసు రూల్స్ ప్రకారం, పేపర్లో వెయ్యడం, మీడియాలో చెప్పడం చేసి ఆమెకి ఎవరైనా ఉన్నారా లేదా తెలుసుకుంటారు. అంతవరకూ ఆమె శరీరాన్ని మార్చురీలో పెడతారు'' అన్నారు.

నా కళ్లనిండా నీళ్లు నిండుకున్నాయి.

నా చీర కట్టుకుని, మంగ చెయ్యి పట్టుకుని నడిచొస్తున్న ఆమెని చూస్తే పిచ్చిదానిలా అనిపించలేదు. ఆ చీరవల్ల తన శరీరాన్ని దాచుకున్న తృప్తి ఆ క్షణంలో ఆమె కళ్లల్లో కనిపించింది. దీనస్థితిలో ఉన్న ఆమెపై కనీసం జాలైనా చూపించకుండా, ఆబగా చూసిన ఆ మానవ మృగాలపై అసహ్యం వేసింది. ఆ అసహ్యంతోనే ఆమె ఈ పాడులోకాన్ని విడిచి హాయిగా ప్రాణాలు విడిచిందేమో!

ఆమె ఆత్మ శాంతించాలని మనస్సులోనే దండం పెట్టుకున్నాను. డాక్టరుగారు వెళ్ళిపోయారు.

జనం క్షణంలో మాయమయ్యారు.

మంగ వరండా కడిగి శుభ్రం చేస్తుంది.

ఆమె...ఆమె... నా మనసులోంచి తొలగడం లేదు.

మర్నాడు పేపర్ రాగానే ఆదుర్దాగా తిరగేశాను.

'భర్తపెట్టే హింసలు భరించలేక ఇల్లు విడిచి జూబ్లీహిల్స్ కొండలమీంచి చావాలనుకున్న ఆమెను, కొందరు దుండగులు రక్షించి సామూహిక మానభంగం చేశారు. తరువాత ఆమెను గేలిచేస్తూ కొందరు తుంటరులు వెంటపడగా ఆమె పిచ్చిదానిలా రోడ్లంట పరుగెత్తి, ఎవరో పుణ్యాత్ముల చలవవల్ల మానాన్ని దాచుకున్నా ప్రాణాలు నిలుపుకోలేకపోయింది. ఆమె తాలూక వారెవరయినా ఉంటే సంప్రదించవలసింది' అంటూ పోలీసు అధికారులు చేసిన ప్రకటనా, దానికింద ఈ సందర్భంగా పదిమంది అల్లరిమూకను అరెస్ట్ చేశాం' అన్న వాక్యం చదివి నిట్టూర్చాను.

ఆడది ఇంట్లో దారుణాలను తప్పించుకోవాలనుకుని బయటకొస్తే, బయటి ప్రపంచం మరీ దారుణం, పొయ్యి మీంచి నిప్పుల్లో పడ్డట్టే!

మనం ఉన్నది మనుషుల మధ్యేనా?

★